హోళికా పూర్ణిమ

[కథానిక]

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

ఏకాదశినుంచే రంగులు చల్లుకోటం ప్రారంభించారు కొద్దికొద్దిగా. చతుర్దశినాటికి తెల్లచొక్కా హిందువు బజార్లో కనిపిస్తే ఒట్టు. ఆ మార్వాడీల వీథిలో ప్రతి మేడమీదా పీపాలిక పీపాలు రంగునీళ్లు పెట్టుకుని, పిచికారీలతో దారినపోయే మనుష్యుల్ని తడిపి ముంచెత్తుతున్నారు. కాస్త ఎరిగున్నవాళ్లు కనిపిస్తే "ఎక్కడనుంచీ రావడం?" అంటూ ఓ క్షణం నిలవేసి, పంట్లాంజేబులోంచి తడికుంకం చాటుగా తియ్యడం, మొహమంతా పట్టించడమూను! కొంచెం ఆకతాయిమూక నూనెల్లో రంగులు కలిపి తలంట్లు పోసుకున్నా కూడా పోకుండా ఉండేట్టు ఒకటేరంగు వెయ్యటం ఒళ్లంతాను!!

సీతాకోకచిలకల్ని ఒంటిమీద సందులేకుండా పరుచుకుని కిలకిలలాడుతూన్న చందమామలల్లే మేడల వసారాల్లో యువతులు తిరుగుతున్నారు. చిన్నకారు పిల్లలు విరిగిన కుర్చీలూ, బల్లలూ, దర్వాజాలూ కూర్చి హోళికను తయారుచేస్తున్నారు వీథిమొదట్లో, దహనం చెయ్యటానికి. చందాలు పోగుచేసి కొను క్కొచ్చిన కర్ర చాలనట్టుగా యింటింటికీ పోయి తెస్తున్నారుకూడాను అడిగీ, అడక్కుండా. ఆడవాళ్లు అడ్డ పెట్టినా, యింట్లో పిల్లలు చాటుచాటున అందిస్తున్నారు మొగవాళ్లు చూసీచూడనట్టూరుకోటంచేత. ఇంటికొచ్చిన పిల్లలమీద రంగునీళ్లు తడిసి ముద్దయేటట్టు చల్లి, వాళ్లచేత మళ్లీ చల్లించుకుని, విరగని వస్తువుల్ని కాస్తో కూస్తో విరిచి సరిచేసిన ఏకొయ్యవస్తువో యిచ్చి పంపని యిల్లే లేదు...

షేక్ గులాంమహమ్మద్ నెరిసినగడ్డము, కుచ్చు టోపీ, గోధుమరంగు షెర్వానీ, తెల్లటి పైజామా, వెండిపొన్నుకర్రా ఆయనా చెక్కు చెదరకుండా అప్పుడే యింటికొచ్చాడు. ఎంత పెద్దఉద్యోగం చేసినా నమాజు మానేసిన పాపాన పోలేదు ఆయన. చిన్నపిల్లలికికూడా తెలుసు ఆయనమీద రంగు చల్లరాదని. "ఆయనేం ఆకాశంలోంచి ఊడి పడ్డాడా? మన ఊళ్లో మన వీథిలో మన యిళ్ల మధ్య యిన్నేళ్లనుంచీ వుంటూ, మన పండగలో రంగు నీళ్లు కాసిని చల్లించుకుంటే తప్పేముచ్చిందేమిటి?" అని నిరుడు పండగల్లో ఓముఠాగా కొంతమంది యువకులు ఆయనింటికెళ్లేసరికి, ఆ మేడమీదనే వుంటున్న బన్సీలాల్ వారించాడు. గులాంమహమ్మద్ మటుకు జరుగుతున్న విషయమంతా విని ఊరుకున్నాడు తప్పితే "ఫరవాలేదు చల్లండి." అనలేదు. ఈయేడు ఆయన్ని సాంతం వదిలిపెట్టారు అంతా కూడాను.

సయీదా మటుకు యీరంగునీళ్ల సరదాలో చిన్నప్పటినుంచీ మునిగితేలే మనిషే. "ఏం నాన్నా, నేను చల్లనా మీమీద మరి?" అని అంది యీయేడు గులాంమహమ్మద్‌తో. "మన మతంలో లేదమ్మా యీ" అన్నాడు గంభీరంగా. "ఒద్దని వుందేమిటి మరి?" అని మళ్లీ అడిగింది పెంకెగా. "అందుక నేగా నువ్వు రంగునీళ్లు చల్లుతున్నా, చల్లించుకుంటున్నా నేను ఊరుకుంటున్నా" అన్నాడు చాకచక్యంగా.

"మరి మీమీద చల్లనియ్యరేం ?" అని ఎదురు ప్రశ్న వేస్తున్న కూతుర్ని వీపుమీద చేత్తో నిమురుతూ "మొత్తంమీద నువ్వు వాళ్లల్లో కలిసిపోతున్నావులే... సరేకాని...నమాజు వేళయింది.. నీళ్లు తీసుకురా... కాళ్లు కడుక్కుంటానికి..." అని మాట తప్పించేశాడు గులాంమహమ్మద్.

"ముందొచ్చిన చెవులకన్న తరవాతొచ్చిన కొమ్ములు వాడి" అన్నట్లు మతంపట్టుదలల్లో గులాం మహమ్మద్‌కీ యితరసాహెబులికీ ఏమీ సరిపడేది కాదు. తానెరిగినంతవరకు తన ముత్తాతలముత్తాతలు కూడా మహమ్మదీయులేననీ, భారతదేశంలో వుండే యితరమహమ్మదీయులల్లే తన పూర్వీకు లెవరూ హిందూమతంలోని ముస్లింమతం అవలంబించినవాళ్లు కారనీ గులాంమహమ్మద్ సగర్వంగా చెప్పుకుంటూ వుండేవాడు. ఆమాట వినేసరికి యిక్కడి సాయిబులికి చర్రుమనేది. షురాబ్‌షరీఫ్ ఆయనకి మంచి నీళ్లప్రాయం. అవును మరి! వాళ్ల నాన్న చిన్నప్పుడే నూరిపోశాడు. మొదట్లో ఆయన ప్రతిశుక్రవారమూ పెద్దమసీదు కెళ్లేవాడు. "మౌల్వీ! మౌల్వీ!" అంటూ గౌరవంగా చూసేవాళ్లు కూడాను తక్కిన ముస్లింలు. మూడేళ్లకింవట ఊళ్లో హిందూ ముస్లింకొట్లాటలు ప్రారంభమైనప్పుడు చదువుకున్న వారుకదా అని ముస్లింలంతా యీయనసలహా అడిగారు. "మతంపేరుతో ఒకళ్ల నొకళ్లు చంపుకోటమంత మహా పాతకం యింకోటి లే"దని స్పష్టంగా వాళ్లతో చెప్పేసరికి, యీయనమీద వుండే గౌరవం సన్నగిలింది వాళ్లకి. వాళ్లు యింకా తక్కువ చదువుకున్న వాళ్ల నాయకత్వంకిందా, అసలు చదువుకోనివాళ్ల అధ్వర్యంకిందా దోపిడీలూ, దహనాలూ, హత్యలూ సాగించారు. ఆ అల్లర్లలో ఓశుక్రవారంనాడు మసీదులో గులాంమహమ్మద్‌ను ముస్లింలంతా చుట్టుముట్టి నిలవేసి అడిగారు—"నువ్వు ఆ మార్వాడీవీథిలోంచి ఎప్పుడు వెళ్లిపోతావు ?"అని.

"ఎందుకూ వెళ్లిపోవడం ?"అని అడిగాడు ఆశ్చర్యంగా. ఆమాటకి ముఠానాయకుడు విషపునవ్వు నవ్వి "ప్రాణాలు దక్కించుకుంటానికి..."అని జవాబు చెప్పాడు. అతని పేరు గజనీ. అతని తాతలు ముగ్గురిలో యిద్దరు హిందువులే. వారి సంతానంకూడా పంజాబులో యిప్పటికీ వుంది. ఇతని ముత్తాత నవాబు దర్బారులో జేరి నవాబుప్రాపకంకోసం ముస్లింమతం స్వీకరించి ఓ జాగీరు సంపాదించాడు. మతం మార్చగానే భార్య తన బిడ్డల్ని తీసుకుని పుట్టింటికి పోయింది. భర్త ఓదాసీదానికి యిస్లాంమతం యిప్పించి పెళ్లి చేసుకున్నాడు. ఆమెకి పుట్టినవాడే గజనీతాత. తాత తండ్రులతోనే జాగీరు సొంతమైనా, గజనీకి మటుకు జాగీర్దారీఅలవాట్లూ, మూర్ఖత్వమూ మటుకు పోలేదు. ఉర్దూ మాట్లాడటం మాత్రం ఒచ్చుతప్పితే, పట్టుమని పదిబంతులు రాయలేడు. కురానుగిరాను తోనూ, నమాజూ గిమాజూతోనూ ఏమీ అతనికి సంబంధం లేదు. హిందూముస్లింకొట్లాటల్లో మటుకు మతోద్రేకాన్ని రెచ్చగొట్టి దోపిడీలు పురిగొల్పి లూటీ సామాన్లు జాగ్రత్తగా దాచెయ్యడంవల్ల యిటీవల గజనీ ఓ పిల్ల జాగీర్దారై పోయాడు మళ్లా.

గజనీ వ్యంగ్యపుపలుకులూ, అతని కుచ్చితపు నవ్వూ గులాంమహమ్మద్‌కి అసహ్యం వేశాయి. చీదరించుకున్నట్లుగా చూస్తూ "నేను చచ్చేది ఒక్కమాటే..."అన్నాడు.

"కాని ఆ చావడం యివాళా రేపా అని" అంటూ గద్దించాడు గజనీ...

"నీకు జవాబు చెప్పక్కర్లేదు నేను" అన్నాడు గులాంమహమ్మద్ యీసడింపుగా. తను నాయకుణ్ణి యింత చులకనగా మాట్లాడటం గుంపు సహించలేకపోయింది. గజనీ పళ్లు పటపటలాడిస్తూ "నాకు సమాధానం చెప్పనివాళ్ల గతేమయ్యేదీ పట్నంలోని ప్రతి ముస్లింబిడ్డకీ తెలుసు ముసలికుక్కా!" అన్నాడు. అంత పండితుణ్ని "ముసలికుక్కా!" అని తమ నాయకుడు అన్నందుకు గుంపంతా ఫక్కున నవ్వింది. గజనీకీ నవ్వొచ్చింది. గులాంమీద కోపమంతా పోయినట్టు వీపుమీద చెయ్యివేసి నిమురుతూ "మీరు హిందువుల వీథిలో వుంటే ఎప్పుడో అప్పుడు వాళ్ల చేతుల్లో పడి

ప్రాణాలు ఒదలకతప్పదు...అందుకని" అంటూ ఏదో సలహా చెప్పబోతున్న గజనీని విదుల్చుకుంటూ...

"ఈముసలికుక్కను చంపే హిందువు ఎక్కడా వుండడు. ఈపట్నంలో అసలే లేడు. ఆఫీథిలో మువ్మాటికీ లేడు..."అని లేచాడు గులాంమహమ్మదు.

"ఇలాంటి పిచ్చిచేష్టలు చేసే నక్కలికి జవాబు చెప్పేందుకు హిందువులే అక్కర్లేదు." అన్నాడు మూకలోంచి ఒకడు.

"ఒళ్లు దగ్గరపెట్టుకు మాట్లాడు..." అంటూ గజనీ ఆమూకలో మనిషిని కోప్పడి "మాల్వీగారూ! కోపగించకండి...మతంకోసం, మాకోసం, మీకోసం అల్లా పేరు చెప్పుకుని మీ కోమనవి చేసుకుంటున్నా... బన్సీలాల్ సంగతి మీకు తెలుసుకదా?"..... అన్నాడు...

గులాంమహమ్మదు జవాబేమీ చెప్పలేదు... గజనీ మళ్లా అందుకుని "వాడి మామ లక్షలికి అధికారి...వాడు వేలకి వేలు కుమ్మరించి ముస్లింలను చంపిస్తున్నాడు..." అని సాగించాడు.

గులాంమహమ్మద్ చీదరించుకుని వెళ్లబోగా మూక అడ్డంపడినట్టుగా ఒచ్చి... "సర్దార్ చెప్పే మాటలు ఆలకించండి మాల్వీజీ..." అన్నారు. ఏమి చెయ్యటానికీ తోచక చూస్తున్న గులాంమహమ్మదు భుజంమీద చెయ్యేస్తూ గజనీ తన గాథ పూర్తిచేశాడు. "బన్సీలాల్ పని మీరు కానిస్తే మిగతాసంగతి మేము చూసుకుంటాం. ఇంజనీరు తన అల్లుడనే ధీమాతో వాడు చేసే ఘోరాలికి కాస్త అడ్డు తగుల్తుంది బన్సీలాలును మీరు..."

గులాంమహమ్మద్ యిక పట్టలేకపోయాడు. తను యిన్నాళ్లు ప్రాణస్నేహితునిగా చూస్తున్న బన్సీలాల్‌ను చంపమని ఒక చవట సలహాయిస్తున్నాడు. అదీగాక అల్లాపేరుతో యీహత్య చెయ్యాలిట! ఇంతకన్న ఘోరం ఏముంటుంది?

"నన్ను వెళ్లనియ్యరా ఏమిటి?" అని గద్దిస్తూ అడిగాడు గులాం మహమ్మద్.

"మా ఆజ్ఞ పాటించిన్లేనా?" అని ఉరుముతూ ప్రశ్నించాడు గజనీ...

"అది గడ్డిపరకతో సమానం నాకు..." అని కచ్చితంగా సమాధానంచెప్పాడు గులాంమహమ్మద్...

"కాఫిర్!..."అని మూకలోంచి ఒకడు కేకేశాడు. "కాఫిర్ కంటె కనాకష్టం...ద్రోహి..."అని నలుగురన్నారు...

"అసలు వాడిని యిక్కడే దేవుని సన్నిధికి పంపితే!..." అని ఒక సాహసికు డన్నాడు...

"కాని సయీాదా...మన కందదు..." అని గజనీ బాహాటంగా సణిగాడు...

గులాంమహమ్మదుకు పిచ్చెత్తినట్టయింది. "పిశాచాల మధ్య నేను యిన్నాళ్లూ దేవుని ప్రార్థిస్తున్నా... ఛీ!! ఛీ!!!" అంటూ దూసుకుపోయాడు...ఎవరూ అడ్డు పెట్టలేదు...అప్పటికీ యిప్పటికీ ఆయన మసీదు మొహం చూడలేదు మళ్లా.

౨

బన్సీలాల్ తండ్రి లక్ష్మీచంద్ కూడా గొప్ప నగలవ్యాపారస్థుడే. గులాంమహమ్మద్ పద్ధెనిమిదేళ్లవాడుగా ఉన్నప్పుడు అతని దూరపుబంధు వొకడు అతనిని లక్ష్మీచంద్ దగ్గిరికి తీసుకొచ్చి "వీళ్లది గొప్ప ముస్లింవంశం. తండ్రి నిరుడే చనిపోయాడు. ఇతనిప్పుడు ఇంగ్లండు వెళ్లి చదువుకోవాలని చూస్తున్నాడు. మీ సాయం కావాలి..."అని చెప్పాడు. ఒక్కొక్కరి మొహం చూస్తే దగ్గిరికి తియ్యబుద్ధవుతుందో ఏమో! లక్ష్మీచంద్ ఒకటిరెండు ప్రశ్నలు వేసి "సరే! మాఅబ్బాయికూడా వెడుతున్నాడు యింగ్లండు...కలిసే చదువుకుంటారు..." అన్నాడు.

బన్సీలాలూ, గులాంమహమ్మదూ కలిసి ఇంగ్లండు వెళ్లారు. ఒకచోటే వుండి చదువుకున్నారు. ఇండియా కొచ్చి ఒకేచోట ఉద్యోగంలో చేరారు. వేరువేరు జిల్లాల్లో పని చేసినప్పుడు వీలుకాకపోయినా, ఒక ఊళ్లో పనిచేస్తున్నప్పుడు ఒకే

యింట్లో చెరోభాగంలో వుండటం వాళ్ళ కలవాటై పోయింది. ఇంగ్లండులో ఉన్నప్పుడు మతంవిషయంలో ఆట్టే పట్టుదలలూ కట్టుదిట్టాలూ కనపరిచేవాడు కాదుగాని ఉద్యోగంలో చేరింతర్వాతా, మరీ ముఖ్యంగా భార్య పోయినతర్వాతా, గులాంమహమ్మదుకు మతాచారాలు ఎక్కువయ్యాయి. సయీదా పుట్టకపూర్వం యిద్దరు మొగపిల్లలు పుట్టిపోయారు. గులాంకు మొదటి మొగపిల్లాడు పుట్టిన వారంరోజుల్లోనే బన్సీలాలుకు కిషన్‌లాల్ పుట్టాడు. ఈ పిల్లలిద్దరూ ఆటపాటల్లో కలిసి మెలిసి తిరగటంతో గులాం మహమ్మదుకు కిషన్‌మీదకూడా ప్రేమ ఏర్పడింది, తన కొడుకు హుసేన్‌మీదమల్లేనే. ఆమూడేళ్ళకి మరో కొడుకు పుట్టి నెలతిరక్కముందే పోయాడు పాపం. మరో మూడేళ్ళకి సయీదా పుట్టింది. ఆఏడే మశూచికం పోసి హుస్సేన్ పోయాడు. పాపం! గులాం దుఃఖానికి మేరలేదు. కిషన్‌ను చూసుకుంటూ తన దుఃఖాన్ని మరిచిపోవటానికెంతో ప్రయాసపడేవాడు. నిజానికి అలా శోకోపశమనంకూడా అయ్యేది కొంతవరకు.

భ్రాతృగండమేకాకుండా మాతృగండంకూడా ఉందేమో, సయీదాజన్మలగ్నంలో! పదకొండో నెలలో తల్లికి విషజ్వరం తగిలింది. మూడోవారంలో అన్నిదుర్లక్షణాలూ కనిపించాయి. సరే, కళ్ళుమూసింది శాశ్వతంగా. గులాంమహమ్మదుకు దుఃఖంకంటె వైరాగ్యమే ఎక్కువైంది. గడ్డంపెంచడం అదేమొదలు. నమాజు నిత్యకృత్యాల్లో ఒకటయిపోయింది.

పాకిస్థాన్ ఒచ్చింతర్వాత ఇండియాలో ఉండే ముస్లింఉద్యోగస్థులెవరన్నా పాకిస్థాన్‌కు వెళ్ళదలచుకుంటే వెళ్ళవచ్చు అన్న రోజుల్లో, బన్సీలాలే స్వయంగా గులాంమహమ్మదుని అడిగాడు "ఏమోయి! నువ్వు వెళుతావా?" అని జంకుతూ జంకుతూ. గులాంమహమ్మదుకు కళ్ళనీళ్ళపర్యంతం అయింది. "మనుష్యుల్ని అడగాల్సిన ప్రశ్న కాదోయ్ బన్సీ..." అని గద్గదికస్వరంతో జవాబు చెప్పాడు. బన్సీకి చచ్చినచావైంది. చాలా క్షమార్పణలు కోరాడు. నిజానికి గులాంమహమ్మదువైఖరి అతనికి అనుమానం పుట్టించి వుంటుంది. భార్య పోయిన దుఃఖంవల్ల జనించిన వైరాగ్యచింతే గులాంను మతకర్మలమీదికి తిప్పింది కాని, పరమతద్వేషం దానికి పర్యవసానం కాదని బన్సీలాల్‌కు తేలికగా అర్థంకాలేదు.

తల్లి పోయినప్పటినుంచీ సయీదా బన్సీలాల్ యింట్లోనే పెరిగిందన్నా అతిశయోక్తి కాదు. భగవంతుని కృపవల్ల బన్సీలాలుకూ యింత వేసీ వెయ్యకుండా వుండటమే కాకుండా పిల్లాజెల్లలికి కూడా కొరవలేదు. నిజానికి సయీదాకూడా బన్సీలాల్ పిల్లల్లో ఒకత్తె అయిపోయింది. హోళీపండగేమిటి? దీపావళేమిటి? దసరా ఏమిటి?. సంక్రాంతేమిటి? అన్ని పండగల్లోనూ వాళ్ళతోపాటు సయీదా కూడా పాల్గొనేది. తండ్రికి ఎంతమాత్రమూ కష్టం లేకపోవటంమూలాన సయీదాకు పెద్దదయింతర్వాత కూడా ఆ సరదాల నేమాత్రం తగ్గించుకోవలసిన అవసరం కలగలేదు. మొహరం, రంజాన్, బక్రీదులాంటి పండగల్లో తండ్రి చెప్పినట్లు చేసేది. రంజాన్‌రోజుల్లో తండ్రి ఉపవాసం ఉంటే ఎంతో జాగ్రత్తగా ఉపచరించేది కూడాను. కాని ఇంగ్లీషుచదువు చదువుకోటం మూలాన యీరోజుల వేషాలూ, ఫ్యాషన్లూ అలవాటయ్యాయి, బన్సీలాలు కుటుంబంలోవాళ్ళతోపాటు సయీదాకి కూడాను.

ఓమాటు సంవత్సరంపాటు గులాంమహమ్మదును బారిసాల్ జిల్లాకు మార్చారు. బన్సీలాల్ మటుకు కలకత్తాలోనే వున్నాడు. "అమ్మాయీ, నువ్వుకూడా బారిసాల్ వస్తావా?" అని అడిగాడు సయీదాని తండ్రి. "మీరు రమ్మంటే..." అంది సయీదా చిరునవ్వు నవ్వుతూ.

ఆయన రమ్మనలేదు. సయీదా బన్సీలాల్ యింట్లోనే వుంది. ఆఏడు దసరారోజుల్లో బన్సీలాల్ కుటుంబం అంతా చక్కగా అలంకరించుకుని కాళీ దేవాలయానికెళుతూ "సయీదా, నువ్వుకూడా వస్తావా?" అని అడిగారు. "నాన్నగారు కోప్పడుతారేమో!" అంది. అంతా ఆమెను విడిచిపెట్టి ఆరోజు గుళ్ళో కెళ్ళారు. రాత్రికి గులాంమహమ్మద్ వచ్చాడు.

సంగతి తెలుసుకుని "నీకు సరదాగా వుంటే వెళ్లు తల్లీ !" అన్నాడు. "మీరు వెళ్లరుగా మరి ?" అని కూడా అడిగింది. "అల్లా నామనస్సులోనే ఉన్నాడమ్మా !" అని జవాబు చెప్పాడు.

మూడోరోజు విజయదశమి... మొహాన స్వస్తిక కుంకపుబొట్టు పెట్టుకుని బన్సీలాల్ కుటుంబంతో సయీదాకూడా గుళ్లోకి బయలుదేరింది. గులాంమహామ్మద్ నవ్వుతూ ఊరుకున్నాడు. ఎలా తెలిసిందో ఏమో, మసీదులోని మూకకీసంగతి తెలిసింది. గుసగుసలూ, నేరారోపణలూ, తీర్పులూ ఎన్నో సాగాయి పరోక్షంగా. శుక్రవారంనాడు మసీదులో నిలవేసి అడిగారు. "మీ అమ్మాయిని హిందువుల్లో చేర్చేశారే ?" అని. అప్పటికి గులాంమహమ్మదంటే ముస్లింలందరికీ గౌరవం బాగా వుండేది. అయినా అడిగారు. బహుశః అందుకనే అడిగారేమో !... "నేనేమీ మార్చలేదే ?..." అన్నాడు.

"మీరు మార్చకపోతే ఆవిడగారే మారచ్చు... రేపు..." అని ఒకడు ఎత్తిపొడిచాడు.

"నిరాటంకంగా మారచ్చు, అలా ఆమె కోరితే..." అని కచ్చితంగా జవాబు చెప్పేసరికి ఎవరూ ఏమీ అనలేకపోయారు.

జరిగిన సంగతి చెప్పేసరికి సయీదాకి చాలా అసహ్యం వేసింది అడిగినవారిమీద... "మారితే మటుకు వీళ్లు అడ్డంఒస్తారా ?..." అని కోపంగా అంది... "అయితే నీకు మారాలని వుందేమిటి ?" అని వ్యంగ్యంగా గులాంమహమ్మద్ అన్నాడు. చురుకైన పిల్ల కావటంచేత తండ్రిభావాన్ని యిట్టే కనిపెట్టి, బిక్కమొహం వేసుకుని "మీ రెందుకు చెప్పలేదు మరి, గుళ్లో కెళ్లొద్దని ?" అని అడిగింది. "ఇప్పుడుమాత్రం నేను ఒద్దన్నానటమ్మా !" అన్నాడు మందహాసం చేస్తూను గులాంమహమ్మద్.

సయీదాతల్లి గొప్పవంశపు బిడ్డేగాని, తోబుట్టువులు కలదికాకపోవటంచేత, సయీదాను తీసుకెళ్లి పెంచుతానన్న మనిషే కనిపించలేదు, తల్లిపోయిన ఆరోజుల్లో. పన్నెండేళ్ల వయస్సులో బన్సీలాల్ కుటుంబంతోపాటు కాళీకాలయానికి వెళ్లినప్పుడు మాత్రం ఊళ్లో ముస్లింలకి సయీదామీద ధ్యాస పుట్టింది. ఆతరవాత నలుగురైదుగురు ఘరానా సాహెబులు సయీదాను తమ కుమారులకి చేసుకుందామనే భావాన్ని గులాంమహమ్మదుకు తెలిపారు. కాని అతని కెవరూ నచ్చలేదు. అలాగే మూడేళ్లు గడిచాయి. "మెట్రిక్యులేషను పూర్తికానియ్యండి నాన్నగారూ !" అంది ఓమాటు యీప్రస్తావన వచ్చినప్పుడు. పరీక్షలో ఉత్తీర్ణురాలైనట్లు తెలిసింతర్వాత మళ్లీ ఆప్రస్తావన యింకా రాలేదు. ఇంటరులో చేరింది బన్సీలాల్ కూతురు సీతతోబాటు. ఆడపిల్లలికి చదువు ఎక్కువైనకొద్దీ వాళ్లని చేసుకోవాలని ఉబలాటపడే పురుషుల సంఖ్య తగ్గుతూవుంటుంది తమ హోదా చాలదనే భయంవల్ల. సయీదా యింటర్లో చేరేసరికి వియ్యంకు లవుదామనే కుతూహలం కల వారు గులాంమహమ్మదుదగ్గిరకి రావటం మానేశారు.

3

గజనీ మూడేళ్లనుంచీ వేస్తున్న ప్రణాళికల్ని ఆయేడు అమలుజరప నిశ్చయించాడు. మతోద్రేకమే కాకుండా, ధనికనిరుపేదభావాలూ, రాష్ట్రవిభేదాలూ సామాన్యజనానికి మరింత వెర్రిని కలగజేశాయి. "కాఫిర్‌ను చంపితే స్వర్గంలో ఒక మెట్టెక్కుతాం. ధనికుణ్ణి చంపితే యిహలోకంలో మంచి ఉన్నతి ఒస్తుంది. అన్యరాష్ట్రీయుణ్ని చంపితే మనరాష్ట్రానికి అభివృద్ధి కలుగుతుంది" అని నూరిపోశాడు గజనీ గుండాలకి. "ఈమూడుఅపరాధాలూ కల లక్ష్మీచందునీ, అతని వియ్యంకుడినీ ముందు బలిపెట్టాలి. దాంతోటి కల్లోలం లేస్తుంది. దోచుకు తినచ్చు..." అని నలుగురు మూర్ఖులకి బాగా నచ్చజెప్పి, తాగపోయించి, డబ్బిచ్చి, పిస్తోళ్లిచ్చి చతుర్దశినాటి రాత్రినుంచే కాపలా కాయించాడు గజనీ.

పండుగరోజులు. అందులోనూ పాకిస్తాన్ విడిపోయినతర్వాత హిందూముస్లింకలహాలు యిండియాలో వుంటాయని ఎవరూ అనుకోలేదు. లక్ష్మీచందూ, వియ్యంకుడు ఫూల్‌చందూ, గులాంమహమ్మదూ,

మోటారులో షికారుకని బయలుదేరి ఊరిబయటగా నదిఒడ్డున పచార్లుచేస్తుంటే పటపటా పిస్తోళ్లు పేల్చు కుంటూ నలుగురు గుండాలు మీదికొచ్చి ఫూల్చందును కాల్చేశారు. లక్ష్మీచందుమీద గురిపెట్టి కాల్చబోయే సరికి గులాంమహమ్మద్ సింహమల్లే ఎగిరి ఆ గుండా మీదికి దూకి, పిస్తోలు లాక్కుని ఎదురు పేల్చేసరికి ముగ్గురూ పారిపోయారు. నాలుగోవాడు చచ్చి పోయాడు గుండుదెబ్బ తగిలి. పారిపోతున్న వారిలో ఒకడు కాల్చిన గుండు లక్ష్మీచంద్ ఎడమతొడలో దూరింది.

ఫూల్చందుశవాన్ని చూసేసరికి ఉద్రేకాలు ఆకాశమెత్తు లేచాయి. గులాంమహమ్మద్ ఒక ముస్లిం గుండాని చంపి లక్ష్మీచందుని బతికించాడనేసరికి ముస్లింల ఆగ్రహం యింతా అంతా కాదు. మసీదులో రహస్యపుసభ జరిగింది. గులాంమహమ్మదును చంపిన వీరుడికి స్వర్గంలో శాశ్వతస్థానం లభిస్తుందని తీర్మా నించబడింది. భగవంతుడే సాక్షాత్తు ఒచ్చినా ఆయన్ని చంపతలపెట్టే మనుష్యులు లేకపోరు. ఆరాత్రి హోళికాదహనంతోపాటు చాలా గృహదహనాలు కూడా జరిగాయి. అమాయకులైన ప్రజలు చాలా మంది చంపబడ్డారు. లూటీలు జరుగుతుంటే పోలీసులు కాల్చారు. గులాంమహమ్మదు నిజమైన ముస్లిం అని తెల్లారేసరికి ఊరంతా పాకిపోయింది.

ఆయన నెరిసిన గడ్డం, కుచ్చుటోపీ, గోధుమ రంగు షెర్వానీ, తెల్లటి పైజామా ధరించి మామూలుగా వెండికర్ర పట్టుకుని వీథిలో కొచ్చాడో లేదో, ఒక హంతకుడు అమాంతం కత్తిని ఆయన డొక్కలో గుచ్చేశాడు, పూర్ణిమనాడు ఉదయం. ఉద్రేకాలకి మతాలతో పనిలేదు. రక్తపిపాస వృద్ధిఅయితే, స్వమత స్థుణ్నే కాదు తన్ను తానే చంపుకుని రక్తపానం చెయ్యాలనిపిస్తుంది.

"అల్లా" స్మరణ చేస్తూ మరణిస్తున్న గులాం మహమ్మదు ఆఖరుస్వరమూ, హంతకుని మోటారు పరుగూ ఒకేమాటు మొదలెట్టినా, ఖడ్గధారులైన పోలీసులు కారును వీథిచివర ఆపేసి చూసేసరికి హిందు వున్నాడు లోపల. పోలీసుస్టేషన్లో తెలిసింది అతను సయ్యద్ అనీ, గజనీతమ్ముడనీని.

లక్ష్మీచందుకూడా రెండువారాల్లో ఆ గుండు దెబ్బలవల్లనే స్వర్గస్థుడయ్యాడు. బన్సీలాల్ మనస్సు మనస్సులో లేదు. గులాంమహమ్మదు మరణంతో సయీదాకు యిహలోకమే శూన్యమైపోయింది. సీతా, కిషన్లాలూ ఆమెను ఓదార్చలేకపోతున్నారు. చిన్నప్పటినుంచీ ఎంత కలిసిమెలిసి వున్నవాళ్లైనా కూడా.

౪

హోళికాపూర్ణిమ మర్నాడే శాంతిసంఘం ఏర్పడింది. ఆసంఘంలో మహమ్మదీయుల ప్రతినిధి గజనీ అయ్యాడు, కంచే చేనుమేసినట్లు. ఉభయ వర్గాలూ శాంతిని కాపాడాలని విన్నవిస్తూ జాతిపిత గాంధీజీ పవిత్రనామాన్ని చక్కగా ఉపయోగించు కుని ప్రకటన చేశాడు. "స్వపరమతవిచక్షణ లేకుండా గుండాలిని ఎదుర్కోటంలో షేక్ గులాంమహమ్మద్ వంటి ఉదారులు ఉభయమతాల్లోనూ ఉండాలని ఉదహరిస్తూ గులాంమహమ్మద్ స్వార్థత్యాగాన్ని కొని యాడాడు గజనీ ఆప్రకటనలో. రాత్రినమాజుసమ యంలో మసీదులో "ఆప్రకటన అంతా రాజకీయపు ఎత్తు" అని తన అనుయాయులికి నచ్చజెప్పాడు. సయీదాను తన కిచ్చి పెళ్లి చేయిస్తాననీ, అందుకుగాను గులాంమహమ్మదును హత్య చేసితీరాలని తన అన్న గజనీ చెప్పటంవల్ల ఆయనను హత్యచేశాననీ, కనక గులాం మహమ్మదుమీద తన కెంతమాత్రం ద్వేషం లేదనీ సయ్యద్ వాఙ్మూలం యిచ్చినట్లు తెలుసుకుని తన పలుకుబడినంతా వినియోగించి దాన్ని ఉపసంహరింప జేశాడు గజనీ. సబుజెయిలులో తమ్ముణ్ని కల్సుకుని "సయీదాను నీకు కట్టబెట్టే పూచీ నాది. నీమీద కేసు ఉపసంహరింపజేస్తాను. నేను శాంతిసంఘం ఉపాధ్య క్షుణ్ణికూడాను. నీకు తెలుసా!"అని అతనికి బాగా నూరి పోశాడు. దున్నలికి గడ్డివేస్తే చాలు! వేస్తానని నచ్చ జెప్పినా కూడా చాలు!! అనుకున్నట్లుగానే సయ్యద్ను జెయిలుమీద విడిచిపెట్టించాడు గజనీ.

శాంతిసంఘంసమావేశంలో మొదటిమాటే చూచాయగా సయీాదామాట ప్రస్తావించి విడిచి పెట్టాడు గజనీ. హిందువులందరికీ గజనీ చెప్పిన మాట చాలా సబబుగా కనిపించింది. స్వపరమతవిచక్షణ పాటించకుండా ఆత్మబలిదానం చేసిన మహాపవిత్ర మతవిశ్వాసం కలిగిన గులాంమహమ్మద్ కూతురు సయీాదాను ఆమతస్థుల చేతుల్లో పెట్టకపోతే, మృతాత్మ క్షోభిస్తుందనీ, కనక సయీాదాను గజనీసంరక్షణకు అప్పజెప్పాలనీ తీర్మానించారు.

తీర్మానపు ప్రతి ముందుగా బన్సీలాల్ కు పంపబడింది. బన్సీలాల్ చిరునవ్వు నవ్వి కిషన్ లాల్ కు చూపించాడు. కిషన్ లాల్ సయీాదాకు చూపించాడు. కబేలాలో కసాయివాడి దగ్గిరికి లాక్కుపోతున్న నాకరుకేసి దీనంగా చూస్తున్న గొర్రెలాగా కన్నీరు నింపుతూ సయీాదా కిషన్ లాల్ కేసీ, బన్సీలాల్ కేసీ చూస్తూ లోపలి కెళ్లిపోయింది.

బన్సీలాల్ తో గులాంమహమ్మద్ స్వయంగానే చెప్పాడు—"నిన్ను చంపవలసిందిగా నాకు గజనీ ఆజ్ఞ యిచ్చాడోయి ఆరోజుల్లో!" అని. "అయితే ఆకత్తి యిలా తీసుకురా!"అని నవ్వుతూ అన్నాడు బన్సీలాల్. "గజనీ అందుతాడుటయ్యా మరి!"అని ఫక్కున నవ్వాడు గులాంమహమ్మద్. తర్వాత యిద్దరూ ఆలోచించారు "యీ కారణంగా గజనీని అరెస్టుచేయిస్తే బాగుంటుందేమో" నని. కాని అన్యసాక్ష్యాధారం లేకుండా తమ ఆరోపణ గజనీమీాద ధ్రువపడదని విరమించుకున్నారు. ఆకాశరామన్న ఉత్తరాలుకూడా గులాంమహమ్మద్ పేర ఒచ్చినవన్నీ ఎప్పటికప్పుడు ఆయన బన్సీలాల్ కు చూపిస్తూ వుండేవాడు. ఒకరిద్దరు హిందువులుకూడా బన్సీలాల్ కు ఆకాశరామన్న ఉత్తరాలు రాశారు. గులాంమహమ్మద్ ని యింట్లోంచి వెళ్లగొట్టమనీ, లేకపోతే అతనే నిన్ను పొట్టనపెట్టుకుంటాడనీని.

ఒక్క ఉత్తరంమటుకు, పాపం, గులాంమహమ్మద్ హత్య చేయబడిన మూడురోజులికి ఒచ్చింది. సయీాదా చూసుకుని మహా చింతించి సీతకిమాత్రం చూపించింది. "నీకూతురిని ఎన్నిరోజులు కిషన్ లాల్ కు..." సీతకూడా ఆపైన చదవలేకపోయింది. అన్నగారితో చెప్పుదామనుకునికూడా బాగుండదని మళ్లీ మానేసింది.

తీర్మానం పంపిన మర్నాడు శాంతిసంఘం అధ్యక్షుడూ, ఉపాధ్యక్షుడు గజనీ, మరోసభ్యుడూ బన్సీలాల్ యింటికి ఒచ్చి ఫూల్ చందూ, లక్ష్మీచందూ వధింపబడినందుకు విచారాన్ని తెలుపుతూ, గులాంమహమ్మద్ ఆత్మబలిదానానికి ప్రశంసిస్తూ, తీర్మానం మాట ఎత్తి సయీాదాను గజనీకి అప్పజెప్పవలసిందిగానూ, అప్పుడే స్వర్గంలో ఉన్న గులాంమహమ్మద్ ఆత్మ తృప్తిపడుతుందనీ సవినయంగా మనవిచేశారు. అదీగాక సయీాదా బన్సీలాల్ యింట్లోనే యింకా వుంటే శాంతిభద్రతలకు భంగం వాటిల్లవచ్చుననీ, ముస్లింలలో యీవిషయమై తీవ్రమైన పట్టుదలలు ఉన్నట్టున్నూ గజనీ మరీమరీ చెప్పాడు. అన్నీ విన్న తర్వాత బన్సీలాల్ సూటిగా గజనీని ప్రశ్నించాడు: "మూాడేళ్లక్రితం గులాంమహమ్మదుతో నన్ను చంపివేయవలసిందిగా మీారు చెప్పలేదా?" అని. గజనీ తెల్లమొహం వేసి "ఇంతకన్నా అభాండం మరొకటుండదు." అని నీళ్లునమిలాడు. తక్కిన యిద్దరూ ఒకళ్ల మొహం ఒకళ్లు చూసుకున్నారు. గులాంమహమ్మదుడైరీ తీసుకొచ్చి కిషన్ లాల్ శాంతిసంఘం ముందు పెట్టాడు. "గులాంమహమ్మద్ ను చంపిన సయ్యద్ ను బెయిలుమీాద విడిపించడంలోనూ అతను యిచ్చిన వాఙ్మూలాన్ని ఉపసంహరింపజెయ్యడంలోనూ మీా ఉద్దేశం ఏమిటి?" అని కిషన్ లాల్ ప్రశ్నించాడు.

"అనవసరప్రసంగం చేస్తున్నారు మీారు..." అని గజనీ గుడ్లురుముతూ జవాబు చెప్పాడు.

"సయీాదాకు మైనారిటీ వెళ్లింది. ఆమె యిష్టం... చిన్నప్పటినుంచీ మాయింట్లోనే పెరగటంవల్ల మేము ఆమెను బుద్ధిపూర్వకంగా వెళ్లగొట్టదలచలేదు." అన్నాడు బన్సీలాల్. ఆమాట కెవరూ కాదనలేకపోయారు. సయీాదాఅభిప్రాయం కనుక్కో

టానికి మరికొంతమంది పెద్దమనుష్యు లుండా లని గజనీ అనడంచేత మూడోరోజుకు వాయిదా వేశారు.

"నాతండ్రిని పెంచి పెద్దచేసిన సేఠ్ లక్ష్మీచంద్‌నూ, ఆయనవియ్యంకుడు ఫూల్‌చందునీ చంపడమే కాకుండా నన్ను ఏడాదివయస్సునుంచీ తన పిల్లలతోపాటు పెంచి పెద్దచేసిన బన్సీలాల్‌ను హత్య చేయవలసిందని మీనాయకుడు సాక్షాత్తు నాతండ్రితో చెప్పాడు. అలా చెయ్యకపోవడంచేత నాతండ్రినే మీనాయకుడి తమ్ముడు ఘోరహత్యచేశాడు. మతం పేరుతో యీ క్రూరకృత్యాలు జరిగాయి. అసలు మతమంటేనే నాకు నమ్మకంలేదు. అందులోనూ ముస్లింమతంమీద. ముస్లింలని పేరుపెట్టుకున్న మీమూలంగా నాకు ఆస్థ ఎంతమాత్రమూ లేదు. ఈఘాతుకమృగాలమధ్యకి నేను రావటంకన్నా ఆత్మహత్య చేసుకోటం మేలు. నేను సయీదా అనే పేరుతో నాయిష్టం వచ్చినచోట వుండటంవల్లనే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని పెద్దలు భావించేటట్టయితే నేను యీక్షణంలోనే మతం మార్చుకుంటున్నాను." అని సయీదా స్పష్టంగా ఖండితంగా చెప్పేసింది వాయిదానాడు పదిమందిలోనూ.

౧

"పూర్ణిమ" అని పేరు మారిస్తే బాగుంటుంది అంది సీత సయీదాతో. "అవును, హోళికాపూర్ణిమ అనవచ్చుకూడాను" అని వేళాకోళం చేశాడు కిషన్‌లాల్. "నేనుమాత్రం సయీదా అనే అంటాను నాకోడలిని" అన్నాడు బన్సీలాల్.